క్లుప్తంగా

శ్రీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు

రాయచోటి (జగదాంబ సెంటర్) : మానవత్వంలో దైవత్వాన్ని కృష్ణావతారం చూపించిందని వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. యథా యథాహి ధర్మస్య గ్లానిర్భవతి భారత అంటూ.. తాను ఏది ఆచరిస్తే అదే ధర్మం అంటూ జగద్గురువుగా శ్రీకృష్ణుడు నిలిచారన్నారు. యుగయగాలుగా శ్రీకృష్ణుడి తత్వం, జీవితం మానవ జీవితాన్ని విశేషంగా ప్రభావితం చేస్తోందన్నారు. కష్టాలను, భయాలను, విఘ్నాలను తొలగించి విజయపథంలో శ్రీకృష్ణనామం నడిపిస్తుందన్నారు. ప్రేమతత్వం, స్నేహతత్వం, ప్రకృతితత్వం, నాయకత్వం ఇవన్నీ కలగలపితేనే శ్రీకృష్ణతత్వమన్నారు. శాంతి, పురోగతిలతో ప్రజలు వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ప్రజలకు శ్రీకాంత్‌రెడ్డి కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు.

సినీ హీరో వివాహ రిసెప్షన్‌లో గడికోట



సినీహీరో అబ్బవరం కిరణ్ వివాహ రిసెప్షన్ వేడుకలో పాల్గొన్న గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె : మండలంలోని పెద్దకోడివాండ్లపల్లెలో ఆదివారం జరిగిన సినీ హీరో అబ్బవరం కిరణ్, హీరోయిన్ రహస్య గోరక్‌ల వివాహ రిసెప్షన్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి నూతన దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, రాయలసీమ విద్యాసంస్థల అధినేత ఆనందరెడ్డి, నాయకులు బసిరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ వడ్డి వెంకటరమణారెడ్డి, వీవీ ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని గట్టుపల్లె సర్పంచ్ చిదంబర్ రెడ్డిని ఆదివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. గట్టుపల్లెలోని ఆయన స్వగృహానికి వెళ్లి శ్రీకాంత్‌రెడ్డి చిదంబర్‌రెడ్డిని కలుసుకుని ఆరోగ్యం పరిస్థితిపై ఆరా తీశారు.

ఆటో స్టాండ్ ఏర్పాటు

పెనగలూరు : మండల పరిధిలోని బెస్తపల్లిలో ఏఐటీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పోలీసులు ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఆటో స్టాండ్ కోసం ఏఐటీయూసీ నాయకులు ధర్నాలు చేశారు. దీంతో పోలీసులు ఆటోస్టాండ్‌ను ఏర్పాటుకు అనుమతివ్వడంతో ఏఐటీయూసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి గంగాధర్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పెనగలూరు ఆటో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు చలపతి, సుబ్బరాయుడు, తదితర ఆటో నాయకులు పోలీసులను సన్మానించారు.

పేకాట స్థావరాలపై దాడులు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని కుడమలూరు అటవీప్రాంతంలో ఆదివారం పేకాట ఆడుతున్న రెండు స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్ఐ శివప్రసాద్ వివరాల మేరకు మండల పరిధిలోని కొడమలూరు అటవీ ప్రాంతంలో ఆదివారం జూదం ఆడుతున్న రెండు పేకాటస్థావరాలపై దాడులు నిర్వహించగా ఒక స్థావరంపై దాడులు చేసి ఐదు మందిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ. 35 వేలు నగదు స్వాధీనం చేసుకోగా, మరో స్థావరంపై దాడి చేయగా నలుగురిని అదుపులోకి తీసుకొని వారివద్ద నుంచి రూ. 12 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి నివాళి

ఓబులవారిపల్లె : వైస్ ఎంపీపీ-2 కొమ్మూరు సుమిత్ర భర్త కొమ్మూరు నరసింహారెడ్డి మృతదేహాన్ని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు వత్తలూరు సాయికిషోర్ రెడ్డి నాయకులతో కలిసి సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నరసింహారెడ్డి మృతికి కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకొని తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కార్యక్రమంలో సింగల్ విండో మాజీ అధ్యక్షులు టంగుటూరు కృష్ణారెడ్డి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి సీడీ నాగేంద్ర, నాయకులు ఉమాశంకర్‌రెడ్డి, కొలవల అమరనాథరెడ్డి, టంగుటూరి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసిన పోలీస్



రక్తదానం చేస్తున్న పోలీస్ మనోహర్

రాయచోటి టౌన్ : ఆపదలో ఉన్న గర్భిణీ శిరీషాకు రాయచోటి పోలీస్ రక్తదానం చేశారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లె మండలం కేంద్రానికి చెందిన శిరీష రాయచోటిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి కాన్పు కోసం వచ్చింది. అక్కడ పరీక్షించిన వైద్యులు రక్తహీనత ఉందని చెప్పారు. బాధితులు ఆయుష్ రక్తదాన సేవా సంస్థ వ్యవస్థాపకుడు కటారు శివను ఆశ్రయించగా ఆయన సుండుపల్లె పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మనోహర్ ద్వారా రక్తదానం చేయించారు. శిరీషా కుటుంబసభ్యులను రక్తదానం చేసిన కానిస్టేబుల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కోల్‌కతా ఘటన బాధాకరం



కోల్‌కతా జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన బాధాకరం. ఇలాంటి సంఘటనలతో వైద్య సేవలకు మనోధైర్యం దెబ్బతింటుంది. ఇలాంటి సంఘటనలు మరోసారి జరగకుండా నిందితులకు ఉరిశిక్ష విధించాలి. ఆసుపత్రుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలి. నియమ నిబంధనలను కచ్చితంగా పాటించేలా అధికారుల చర్యలు తీసుకోవాలి.

– నీలావాణి, స్టాఫ్ నర్సు, మాధవరం పీహెచ్‌సీ, సిద్ధవటం మండలం



భద్రత, భరోసా కల్పించాలి



మహిళా డాక్టర్ల భద్రతకు భరోసా కల్పించాలి. వైద్యులపై దాడులు అరికట్టేందుకు చట్టాలను కఠినతరం చేయాలి. కోల్‌కతా సంఘటనలో నిందితులకు కఠినశిక్ష విధించేలా ప్రభుత్వాలు చూడాలి. ఆసుపత్రులలో మౌలిక వసతులు కల్పించాలి. రోగి ఎంతటి బాధలో ఉన్నా వైద్యుడిని చూడగానే వారిలో ధైర్యం వస్తుంది. అలాంటిది ప్రాణం పోసే వారికే రక్షణ లేకుంటే ఇక సమాజంలో మనుగడ సాధించడం కష్టం.

– షేక్ రియాజ్, టి.చాకిబండ పీహెచ్‌సీ వైద్యాధికారి, చిన్నమండెం

అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలి



ఆసుపత్రుల్లో మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి పటిష్టమైన భద్రత కల్పించాలి. డాక్టర్లు ఆసుపత్రుల్లో ఎలాంటి రక్షణ లేని వాతావరణంలో పనిచేస్తున్నారు. అందువల్ల రాత్రి వేళల్లో ఆసుపత్రిలో ఒక పోలీసును అయినా బందోబస్తుగా ఏర్పాటు చేస్తే మహిళా సిబ్బంది ధైర్యంగా ఉండగలరు. ప్రభుత్వం ఆస్పత్రుల్లో అవుట్ పోస్టును ఏర్పాటు చేయాలి.

– మాధవ్‌కుమార్‌రెడ్డి, ఆర్థోపెడీషియన్, ప్రభుత్వ ఆసుపత్రి, రాజంపేట

దోమలకాటు.. జ్వరాలపోటు



సుండుపల్లె: జీకేరాచపల్లెలో మురుగునీరు పేరుకుపోయిన దృశ్యం



రైల్వేకోడూరు అర్బన్: చెత్తకుప్పల వద్ద కనిపిస్తున్న పందుల గుంపు



రాయచోటి: మదనపల్లి జాతీయ రహదారిలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

- పడకేసిన పారిశుధ్యం
- విజృంభిస్తున్న దోమలు
- జ్వర పీడితులతో కిటకిటలాడుతున్న ఆస్పత్రులు

రాయచోటి : జిల్లా కేంద్రమైన రాయచోటితోపాటు నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో జ్వరాలు చుట్టుముడుతున్నాయి. సీజనల్ వ్యాధులతో పాటు ప్రధానంగా డెంగీ, మలేరియా, విష జ్వరాలతో ప్రజలు అల్లాడుతున్నారు. పట్టణంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా యుద్ధంలో శత్రువుల పైకి దండయాత్ర చేసేలా కనిపించే సైన్యంతో సమానంగా దోమల దాడులు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల సంక్షేమం, ఆరోగ్యాన్ని గాలికి వదిలి ప్రతికార చర్యలతో ముందుకు సాగుతుండడమే ప్రధాన కారణమని స్థానికులు విమర్శలు చేస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ జ్వరాలు విజృంభిస్తున్నా ప్రభుత్వ వైద్యశాలల్లో అందుకు తగిన సదుపాయాలు అందుబాటులో ఉండటం లేదు. దీంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేదలు ప్రైవేటు ఆసుపత్రులను అధికంగా ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లలేని వారు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే చికిత్స పొందుతున్నారు. కొన్ని గ్రామాల్లో డెంగీ, చికున్ గున్యా జ్వరపీడితుల సంఖ్య ఎక్కువగా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద వర్గానికి చెందిన రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆసుపత్రుల్లోని బెడ్లు రోగులతో నిండిపోతున్నాయి. రాయచోటిలోని వంద పడకల ఆసుపత్రి, లక్కిరెడ్డిపల్లి, సంబేపల్లి, చిన్నమండెం, గాలివీడు, రామాపురం మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మండల కేంద్రాలలోని ఆసుపత్రుల్లో పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందడం లేదు. వైద్యులు, ఇతర సిబ్బంది కొరత కారణంగా రోగులకు సరైన వైద్యం అందడం లేదని తెలుస్తోంది. పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు రోగుల నాడి పట్టడం లేదు. వ్యాధికి అవసరమైన మందులు ఇవ్వడం లేదు. రోగులే మందులను బయట కొనుగోలు చేస్తున్నారు. రాయచోటి నియోజకవర్గం పరిధిలోని మండలాలకు చెందిన రోగులు సైతం రక్త నమూనాలను జిల్లా కేంద్రంలోని రాయచోటి ఆసుపత్రికి వచ్చి చికిత్సలు పొందుతున్నారు. అనేకమంది రోగులు ప్రభుత్వ వైద్యాన్ని పొందలేమని భావించిన వారు అప్పోసప్పో చేసి ప్రైవేట్ వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు.

రాయచోటిలో 5వేల మంది జ్వర పీడితులు..

రాయచోటి నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రులలో ఆగస్టు నెల ఒకటి నుంచి 24వ తేదీ వరకు 5000 మందికి పైగా జ్వరాల బారిన పడినట్లు రక్తపూత నమూనాలలో నిర్ధారణ అయింది. రాయచోటిలోని వంద పడకల ఆసుపత్రిలో 20280 మంది ఆసుపత్రికి వచ్చి చికిత్సలు పొందారు. వారిలో అనుమానం ఉన్నవారికి రక్త పూత పరీక్షలు చేయించారు. వీరిలో 2600 మంది సాధారణ జ్వరాల బారిన పడగా, 763 మంది డెంగ్యూ జ్వరానికి, 1365 మంది మలేరియాతో పాటు మరో 32 మందికి వివిధ రకాల జ్వరాల బారినపడ్డారు. ఇలా మిగిలిన మండలాల్లోనూ పదుల సంఖ్యలో రక్తపూత నమూనాలలో జ్వర పీడితులు బయటపడ్డారు. నియోజకవర్గంలో డెంగీ జ్వరాల విజృంభణ ఏస్థాయిలో ఉందో ఈ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్యం పడకేయడంతో దోమలు అమాంతం వ్యాప్తి చెందాయి. ఫలితంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. అయినా ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదు. చివరికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టలేదంటే పరిస్థితి ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. గ్రామాల్లో పారిశుధ్య లోపించడంతో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. అడుగడుగునా అపరిశుభ్రత తాండవిస్తోంది. దీంతో దోమలు వృద్ధి చెంది ప్రజలను జ్వరాల బారిన పడేలా చేస్తోంది.

గ్రామాల్లో కనిపించని వైద్య శిబిరాలు

వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సీజనల్ వ్యాధుల బారీన పడుతున్నారు. అధికమవుతున్న వ్యాధుల నివారణకు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన వైద్యాధికారులు నేటికి పల్లెల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో మలేరియా, డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇప్పటికైనా గ్రామాల్లో పూర్తిస్థాయిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుకుంటున్నారు.

నిర్లక్ష్యానికి జ్వరాలపాలవుతున్న ప్రజలు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలో పారిశుధ్యం పడకేసింది. జ్వరాల మహమ్మారి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తూవుంది. గ్రామాలలో పారిశుధ్యం కుంటుపడడంతో జ్వరాలు అధికమవుతున్నాయి. పారిశుధ్యంపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో రోజురోజుకు జ్వరాలు అధికమవుతున్నాయి. దీంతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఇదే అదునుగా ప్రైవేటు ఆస్పత్రుల వారు పేద ప్రజలకు పరీక్షల పేరుతో దోపిడీ చేస్తున్నారు. కోడూరు పట్టణంలోని రంగనాయకులపేట, దర్గాపురం ఉంగరాలనగర్, తపాళాకార్యాలయం వెనుక వీధి తదితర ప్రాంతాలతో పాటు లక్ష్మీప్యారడైజ్ ఎదురు వీధిలో మురికి నీరు నిల్వ ఉంటోంది. దీనికి తోడు చెత్తాచెదారంతో అపరిశుభ్రత తాండవిస్తోంది. ఈ మార్గాలలో నిత్యం పాఠశాలలకు విద్యార్థులు, మహిళలు, వాహనాలు తిరుగుతూ ఉంటాయి. అపరిశుభ్రత ఉన్న ప్రాంతంలో పందులు సంచరిస్తూ ఇబ్బంది పెడుతుంటాయి. సాధారణంగా ఇక్కడ పేరుకు పోయిన చెత్త కాల్వలలో ఉంటూ మారికి నీరు ప్రవహిస్తూవుంటుంది. పంచాయతీ అధికారులు పారిశుధ్య కార్మికులు దృష్టి పెట్టకపోవడంతో దోమలపోటు అధికంగా తయారైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని విద్యార్థులు, మహిళలు కోరుకుంటున్నారు.

రాజంపేటలో రెండునెలల వివరాలు	
డెంగీ	5
టైపాయిడ్	73
సాధారణ జ్వరాలు	00
విష జ్వరాలు	00
రాయచోటి నియోజకవర్గం పరిధిలో అగస్టు 1 నుంచి నమోదైన వ్యాధుల వివరాలు	
డెంగీ	785
మలేరియా	1440
సాధారణ జ్వరాలు	2800
ఇతర విష జ్వరాలు	103
రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఆగస్టు నెలలో నమోదైన వ్యాధుల వివరాలు	
డెంగీ	02
మలేరియా	00
విష జ్వరాలు	288
టైఫాయిడ్	84

మొక్కుబడిగా పారిశుధ్య పనులు

రాజంపేట : గ్రామాల్లో పారిశుధ్యం పడకేస్తోంది. మరోవైపు జ్వరాలు విజృంభిస్తున్నాయి. నియోజకవర్గంలోని రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట వీరబల్లి, సుండుపల్లె, సిద్ధవటం మండలాల పరిధిలోని పీహెచ్‌సీ పరిధిలో జ్వరపీడితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ప్రధానంగా డెంగీ, టైఫాయిడ్, మలేరియా, వైరల్ జ్వరాలు సోకుతున్నాయి. వైరల్ జ్వరాలు అధికంగా ప్రతి గ్రామంలోనూ ఉన్నాయి. అధికంగా ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించుకుంటున్నారు. కొంతమంది పేదరోగులు మాత్రం ప్రభుత్వాసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం గురించి పట్టించుకునేవారు లేకుండాపోతున్నారు. మురుగునీటితో రోడ్ల పక్కన కనిపిస్తున్నాయి. కొన్ని మేజర్ పంచాయతీలలో మొక్కుబడిగా పారిశుధ్య చర్యలు తీసుకున్నట్లుగా కనిపిస్తున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు వస్తేనే పారిశుధ్య చర్యలు కనిపిస్తున్నాయి.

ఒంటిమిట్టలో ముందస్తు వేడుకలు



రైల్వేకోడూరు అర్బన్: ఉట్టి ఉత్సవంలో విద్యార్థినులు

ఒంటిమిట్ట : స్థానిక హరిత కల్యాణ వేదికలో ఆదివారం ప్రగతి నృత్య కళా ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు ప్రెసిడెంట్ శశికళ అధ్యక్షతన శ్రీ కృష్ణాష్టమి ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా కేంద్ర సంగీత నాటక అకాడమీ రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కూచిపూడి నాట్య గురువు వేదాంతం రాధా శ్యామ్, విశాఖపట్నం కళాధరణ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ డైరెక్టర్ సందీప్ కుమార్, హైదరాబాద్ స్పార్క్ ఆఫ్ ట్రెడిషనల్ బుక్ ఆఫ్ రికార్డు కో–ఆర్డినేటర్ సుమన్, శ్రావణ్ కుమార్, రఘునాథ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ కృష్ణాష్టమి ముందస్తు వేడుకలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పలు డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. ప్రదర్శన ఇచ్చిన ప్రతి ఒక విద్యార్థికి స్పార్క్ ఆఫ్ ట్రెడిషనల్ బుక్ ఆఫ్ రికార్డు, ప్రగతి నృత్య కళ ట్రస్టు సర్టిఫికెట్, సీతారామ లక్ష్మణుల విగ్రహాలను అందజేశారు. ఈ ప్రదర్శనకు ప్రజల నుండి విశేష ఆదరణ లభించింది.



ఒంటిమిట్ట: శ్రీకృష్ణాష్టమి వేడుకలలో ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

వైభవంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని రంగనాయకులపేటలో రాయలసీమ అకాడమీ పాఠశాలలో ఆదివారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థినులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. చిన్నపిల్లలకు చిన్నతనం నుండే మన సంస్కృతితో ముడిపడి ఉన్న పురాణాల గురించి తెలియచేయాలని శ్రీకృష్ణాష్టమి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

చిన్నమండెం : స్వయం ఉపాధితో మహిళలందరూ ఆర్థికంగా ఎదిగి జీవన ప్రమాణాలు మెరుగుపరచుకోవాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరిత అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రమణమ్మ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి లఖ్‌పతి దీదీల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హరితమ్మ మాట్లాడుతూ మహిళాభివృద్ధి కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. అనంతరం సంఘ సభ్యులకు, సీఆర్‌పీలకు సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం బ్యాంకు లింకేజీ మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, సీసీలు వీఓలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సిద్దవటం : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్‌పతి దీదీ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారని వెలుగు ఏపీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని వెలుగు కార్యాలయంలో ఆదివారం కార్యక్రమానికి సంబంధించిన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో 35 సంఘాల్లోని మహిళలకు రూ. 85లక్షల 30వేల నగదు చెక్కును సర్పంచ్ నాగరాణి మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్‌డీ లక్ష్మీనరసయ్య, వెలుగు సీసీలు, వీఓఏలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.



సిద్దవటం: డ్వాక్రా సంఘాలకు చెక్కును అందజేస్తున్న సర్పంచ్ నాగరాణి

లక్కిరెడ్డిపల్లి : ప్రతి మహిళను లక్షాధికారిగా చేయాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గురుప్రసాద్ పేర్కొన్నారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ మహారాష్ట్రలో వర్చువల్ పద్ధతిలో అజీవిక, లక్పతి దీదీని దేశమంతటా ప్రారంభించడం జరిగిందన్నారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లి మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు సంతోషకుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గురుప్రసాద్ మాట్లాడుతూ దేశ ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి అహర్నిశలు మహిళల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు విరివిగా చేపడుతున్నారన్నారు. ఏపీఎం నిరంజన్ మాట్లాడుతూ ప్రతి ఒక మహిళా ఏదో ఒక ఆర్థికాభివృద్ధి కార్యక్రమాలు టైలరింగ్, పాడి, చేతివృత్తులు, కొవ్వొత్తుల తయారీ మొదలుగునవి చేసుకుంటూ కుటుంబ ఆదాయం నెలకు రూ. 10 వేలు వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ గురించి డీఆర్‌పీ రాజశేఖర్ మాట్లాడుతూ మహిళలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టుకోవాలనుకుంటున్న మహిళలకు 35 శాతం సబ్సిడీ కేంద్రం ప్రభుత్వం ఇస్తుందని తెలియజేశారు. సభ్యులకు పొదుపు అపులు, గ్రామ సమాఖ్యలో సిఐఎఫ్, ఉన్నతి, స్త్రీనిధి,బ్యాంకు రుణాలు, సబ్సిడీ స్కీమ్‌లు, తక్కువ వడ్డీకి రుణాలు ఇవ్వడం జరుగుతుందని, కావున ప్రతి ఒక్కరూ అన్ని పథకాలు సద్వినియోగం చేసుకుంటూ తిరిగి రుణాలు చెల్లించాలని లక్కిరెడ్డిపల్లి సర్పంచ్ తెలియజేయడం జరిగిందన్నారు. అనంతరం రూ. 12.16 కోట్ల మెగా చెక్కును మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గురుప్రసాద్, లక్కిరెడ్డిపల్లి సర్పంచ్ అహల్య, ఏపీకేపల్లి సర్పంచ్, ఏపీఎం నిరంజన్, సీసీలు, అధ్యక్షురాలు, అకౌంటెంట్, అజీవిక, సీఆర్‌పీలు, లక్పతి దీదీలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



చిన్నమండెం: మెగా చెక్కును అందజేస్తున్న మంత్రి సతీమణి హరిత

సుండుపల్లె : మండల పరిధిలోని వెలుగు ఆఫీస్‌లో ఆదివారం లక్పతి దీదీ కార్యక్రమాన్ని ఏపీఎం శ్రీనివాసులు నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు లక్పతి దీదీలుగా అభివృద్ధి చెంది సంవత్సరానికి లక్ష రూపాయలు నికర ఆదాయం, జీవనోపాధులు ద్వారా ఎలా లాభం పొందగలరో ప్రధాన మంత్రి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సభ్యులకు లైవ్ ప్రోగ్రాం నిర్వహించారు. సమావేశంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులకు బ్యాంక్ లింకేజీ ద్వారా 28 సంఘాలకు రూ. 2.82 కోట్ల మెగా చెక్కును పంపిణీ చేశారు. ఈ సమావేశంలో సీసీలు, వీఓఏలు, ప్రజాప్రతినిధులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ పటిష్టతకు కృషి

సుండుపల్లె : మండలంలో జరిగిన పలు కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పాల్గొన్నారు. రాయవరం గ్రామ పంచాయతీ చీనేవాండ్లపల్లెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చీనేపల్లి విశ్వనాథరెడ్డి కుమార్తె వివాహం జరిగిన సందర్భంగా ఆకేపాటి నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయన మడితాడు గ్రామం, జికె రాచపల్లిలో ఇటీవల కువైట్‌లో ప్రమాదవశాత్తు గాయపడిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కుటుంబ సభ్యుడు ఇనాయతుల్లాను వారి స్వగృహంలో పరామర్శించి వారి కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. అనంతరం కేకల దొడ్డిపల్లిలో ఇటీవల వివాహం జరిగిన లక్ష్మయ్య నాయుడు దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మండల నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో మాట్లాడుతూ గ్రామాలలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకం ఉంచి అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో పార్టీ పూర్వవైభవానికి అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తామన్నారు. అలానే ప్రతి నాయకుడు, కార్యకర్తకు అండగా ఉంటానని తెలియజేశారు. కార్యక్రమంలో అజంతమ్మ, జెడ్పీటీసీ ఇస్మాయిల్, వైస్ ఎంపీపీ రెడ్డమ్మ, బీఎల్ నరసింహారెడ్డి, వైఎస్సార్‌సీపీ సర్పంచ్ రామజయచంద్ర, చంద్రనాయక్, బద్రి, రమేష్, బాబురెడ్డి, సల్మాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.



సుండుపల్లె: చీనేవాండ్లపల్లెలో వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

ఆకేపాటికి ఘన స్వాగతం

రాయచోటి టౌన్ : వైఎస్సార్ సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డికి రాయచోటి వైఎస్సార్ సీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆదివారం ఆయన రాయచోటికి వచ్చిన క్రమంలో రాయచోటి – రాజంపేట రోడ్డులోని చెక్ పోస్టు వద్ద ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు రాగానే వైఎస్సార్‌సీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు, పార్టీ శ్రేణులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని వారికి భరోసా కల్పించారు. పార్టీ పటిష్టతకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో శిబ్యాల విజయభాస్కర్, కౌన్సిలర్ సుగవాసి శ్యామ్‌కుమార్, సురేష్‌కుమార్‌రెడ్డి, జావీద్ హుస్సేన్, ముస్తాక్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు



చిన్నమండెం: దర్శనమిస్తున్న మల్లూరమ్మ



లక్కిరెడ్డిపల్లె: ప్రత్యేక అలంకారంలో గంగమ్మ



రైల్వేకోడూరు అర్బన్: అలంకారంలో మారమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని గుండాలపల్లిలో వెలసియున్న మారమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అభిషేకాలు చేసి అమ్మవారికి ప్రతేక అలంకరణ చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

మల్లూరమ్మకు ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామంలో వెలసియున్న శ్రీ మల్లూరమ్మ తల్లికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకులు పలు పూజలను నిర్వహించారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి బంధుమిత్రులతో కలిసి విందును ఆరగించారు.

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్ల గంగమ్మ ఆలయంలో ఆదివారం శ్రావణమాస పూజలను పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొన్నారు.

సిద్దవటం : మండలంలో వెలసిన ఇరుగులమ్మ అమ్మవారికి ఆదివారం వైభవంగా పూజలు నిర్వహించామని ఆలయ పూజారి వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అలంకరణ, సహస్తనామార్చన తదితర పూజలు నిర్వహించామన్నారు. కొందరు భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కుబడులను చెల్లించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. మూలపల్లె గ్రామానికి చెందిన బోనబోయిన రవి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలియజేశారు.

వర్షాలు కురిపించి కరుణించు గంగమ్మా

లక్కిరెడ్డిపల్లె : వర్షాలు కురిపించి రైతులు, ప్రజలను చల్లంగా ఉండేలా కరుణించి కాపాడు గంగమ్మ తల్లీ అంటూ ఆదివారం గంగమ్మ దేవతకు భక్తులు బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. వేలాది మంది భక్తులు గంగమ్మ దేవత ఆలయానికి తరలిరావడంతో క్యూలైన్‌లలో భక్తులు నిండిపోయారు. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ఆలయ ప్రత్యేకాధికారి మారుతీ ప్రసాద్‌లు భక్తులకు సౌకర్యాలు కల్పించారు.